# బతుకు దాబి

తెల్లెద్దు వారం దినాలనుంచీ గడ్డి సరిగా మేయలే! దాన్ని మల్లన్న పశువుల ఆస్పత్రికి పట్టకపాయ. అక్కడ ఒక సూది గుచ్చిరి. ఏం సామీ దీనికి రోగం? అని అడిగె మల్లన్న. 'ముసలి తనమే రోగం' అనె పశువుల డాక్టరు.

'అయ్యో దేవుడా! ఈ కరువు దినాల్లో మళ్లీ ఇదొక భారమా నాకు? మాకు తినే దానికే సరిగ్గా జరగకపోతే ఇంక కొత్త ఎద్దును ఎట్ల పట్టుకుండేది' అని మల్లన్న చింతపడె. పదకొండేండ్లు ఆయప్ప దగ్గరే కష్టపడి పని చేసిన ఎద్దు సచ్చిపోతాంటే, దాని ప్రాణం విలువను మూడువేల దుడ్లలో తప్ప చూడలేకపాయ ఆ సమయంలో!

ఈ కాడెద్దులు ఇట్లే ఉంటే కొండలో ఇన్ని కట్టెలు కొట్టి, బండికి ఏసుకొని పోయి, అమ్మి నాలుగు రాళ్ళు తెచ్చుకుని ఇంటికాడనే ఉందామనుకుంటి. నా పెండ్లాం పిల్లలు బళ్ళారికి కూలికిపోతే! ఆ తెల్లెద్దుగినా సచ్చిపోతే ఒక ఎద్దుతో బండి ఎట్లా కట్టేది, నా సంసారాన్ని ఎట్లా లాగేది అని అంగలారిసె పక్కింటి రుద్రమునెప్ప దగ్గిర.

"ఆకులోడూ ఏడ్చేదే, ఉప్పోడూ ఏడ్చేదే అన్నట్లుంది నీ యవ్వారం! ఒక కాడెద్దుల్తో పదకొండేండ్లు పని జరిపిచ్చుకున్న నువ్వే అట్ల అంగలారిస్తే, నాలుగైదు వేలు పోసి పట్టుకొచ్చిన ఎద్దులు నా దగ్గర రెండు మూడు ఏండ్లు కూడా పనిచెయ్యకపోతే ఇంక నేనెంత అంగలాయల్ల!" అని మల్లా గొంతు తగ్గించి అనె.

"ఆశకు కూడా అంతు ఉండల్ల అప్పా! ఎద్దు కూడా మనిసి మాదిరి నూరేండ్లు బతికి మనకు చాకిరీ చెయ్యల్ల అనుకుంటే ఎట్ల?" అని.

'నిజమే, నా ఎద్దులు నాకు చాకిరీ చేసినన్ని ఏండ్లు, ఈ చుట్టుపక్కల ఎవరి ఎద్దులూ చాకిరీ చెయ్యలే' అనుకుంటే మల్లన్నకు ముసిలెద్దు మింద చెప్పలేనంత మమకారం పొంగుకొచ్చె. ఇంటికి బిర బిర వచ్చె గాటిపాటున కూర్చొని ఆ తెల్లెద్దు మొగంలోకి చూసె.

పదకొండేండ్ల కిందట బుక్కపట్నం పశువుల పరసలోనుంచీ పట్కొచ్చినప్పుడు ఎంత పొగరుమీద ఉండె ఈ ముసిలెద్దు! వీపుమింద ఈగ వాలితే జారిపడేటట్లు ఎంత నున్నగా బలిసి ఉండె! సేన్లలో బురద మళ్ళల్లో ఎంత కష్టించి పనిచేసె! ఎన్ని బండి బాడుగలు సంపాదించి పెట్టె. దీని కష్టం మీద ఆధారపడేకదా... పూటపూటకూ ఇంత ముద్ద సంపాదించుకొని తన సంసారం బతికి బట్టకట్టి ఉండేది! అనుకుండె. తెల్లెద్దు పైనిమిరె. అది చెప్పుకోలేని మూగ బాధతో మల్లన్న మొగంలోకి చూసె. అది అట్లా చూసిన చూపులకి మల్లన్న కడుపులో పేగు కదిలినట్లాయ.

ఎంత కష్టం చేస్తివి తండ్రీ! మా కోసరమే నీ కండలన్నీ కరిగించి పోస్తివి. ఇప్పుడు మమ్మల్ని అన్యాయం చేసిపోతావా అప్పా? అనుకుండె. తెల్లెద్దు నాలిక సాపి మల్లన్న మొగాన్ని నాకబట్టె. మల్లన్న మనసులో దానిమీద నెర్లు గట్లు తెగి... తాను దాన్ని చెర్నాకోలతో జవిరిన దెబ్బలు గుర్తొచ్చె-కరినాత్మున్ని అప్పా! నీరుణం ఈ జన్మలో తీర్చుకోలేను నాయనా అని వలవలా ఏడ్చె.

★★★

మల్లన్న చిన్న కొడుకు కిష్టప్ప బడిలోకి పోతాంటాడు. కడగొట్టు పాపకు రెండేండ్లు. ఎప్పుడు చూసినా వాళ్ల అమ్మను కరుసుకునే వుంటుంది కోతి పిల్లమాదిరి. పెద్ద కొడుకు దొణతిమ్మప్పకు పండ్రెండేండ్లు-ఎద్దుల్లోకి పోతాడు. ఆ పిల్లోడు దొణతిమ్మడు చిన్నప్పటినుండీ తెల్లెద్దుతో ఆడుకుండె. ఆరేండ్ల వయసు ఉన్నప్పుడే ఆ పక్కనుంచీ ఈ పక్కకు, ఈ పక్కనుంచీ ఆ పక్కకూ తెల్లెద్దు కాళ్ళ సందున దూరిపోతాండె. మా ఎద్దులు నన్నేమీ అనవు చూడు అని ఇంటికొచ్చిన పెద్దోళ్ల దగ్గర అరుస్తాండె.

గాటిపక్కన కూర్చొని గంగడోలు నిమురుతాండె. అది కండ్లు మూసుకొని మోర పైకెత్తుతాంటే సంబర పడతాండె. ఎద్దులు మేత మెయ్యకుండా అట్ల గంగడోలు నిమరొద్దురా అని మల్లన్న కొడుకుని గదురుకుంటాండె. ఆ పిల్లోడు ఊరి రెడ్డోళ్లవి ఎద్దులు ఎదురైతే నిలబడిపోయి చూస్తాండె. ఆ ఎద్దుల మెడలో గంటలు మోగుతాండె. కొమ్ములకి తొడిగిచ్చిన కొప్పెర్లు బంగారు మాదిరి మెరుస్తాండె. ఆ కొప్పెర్లకు ఎర్రని కుచ్చులు వేలాడతాండె.

గంటలు గలగలమని మోగుతాంటే, కొమ్ములకుండే గిగ్గుర్లు ఊపుకుంటా అవి నడుస్తాంటే, దాన్ల వైభవం చూసి నోరు ఎల్లబెడతాండె. ఆ ఎద్దుల్నీ ఈ ఎద్దుల్నీ మార్చి మార్చి చూసుకుంటాండె.

'నాయనా! నాయనా! మన ఎద్దులకి కూడా మువ్వల పట్టీలు తే నాయనా! కొప్పెర్లు తొడిగీ నాయనా! కొప్పెర్లకి ఎర్ర కుచ్చులు కట్టీ నాయనా! అని తండ్రిని ఒకటే

ప్రాణం తీస్తాండె.

పిల్లలకు ఉండే కుశాల పెద్దోళ్లకు యాడుంటుంది? సంసారం బరువు కట్టుకుని మల్లన్న మనసు మూల్గుతాండె పాపం!

★★★

ఊరిలో శానామంది రైతులూ, కూలోళ్ళూ బళ్ళారి వైపు వలసపోతాండిరి. అడ పత్తి పొలాల్లో దొరికే కూలి కోసరం. నిన్నటి సంవత్సరం భార్యా కొడుకులు బళ్ళారికి పోతే, మల్లన్న ఇంటి దగ్గరే ఉండె. బండెద్దుల్ని బాడుగలకు తిప్పుకుంటూ; ముసలి తండ్రిని చూపెట్టుకుని. 'ఈ సారి ఆ ముసలాయప్ప ఆరోగ్గం ఇంకా చీనించిపాయ. ఈసారి కూడా ఇంటిదగ్గర ఎవరో ఒకరు ఉండి తీరల్ల. అంతా బళ్ళారికి పోతే ముసలాయప్ప ఒక్కడూ ఉండలేడు' అనుకుండె.

'తెల్లెద్దు సచ్చిపోతే నాకిక్కడ బండి బాడుగల పని ఉండదు కదా. ఈసారి నేనే పోతాన్లే బళ్ళారికి. నువ్వు ఇంటిదగ్గరే ఉండు, నాయనను చూపెట్టుకొని' అని భార్యతో మల్లన్న. అప్పుడు మల్లన్న భార్య గంగమ్మ ఏం మాట్లాడలే.

తెల్లెద్దుకు వచ్చిన రోగమే మల్లన్న తండ్రికి కూడా! ముసలితనం! కూర్చుంటే లెయ్యలేడు. కీళ్ళ నొప్పులు! అన్నం తింటే కడుపులో ఉండదు. తినకపోతే ప్రాణం నిలసదు.

వినికిడి తగ్గె. కంటిసూపు మందగించె. పది అడుగులు నడిస్తే సాలు, కాళ్ళు ఒణుకుతాండె. రేయల్లా నిదురాగారాలు లేకుండా ఉబ్బసంతో బాధపడతాండె. మల్లన్నకు సిన్నప్పుడే తల్లిపోతే మారు మనువు చేసుకోలే ఆ తండ్రి! ఆయప్పే కొడుకుకు తల్లయి పెంచె. సేద్యం నేర్పించె. బాగా పనీ పాటా తెలిసిన ఒక పిల్లని చూసి పెండ్లి చేసి కొడుకును ఒక ఇంటివాన్నిగా చేసె. ఆ కొడుకుకు మల్లీ కూతురూ కొడుకులూపుట్టిరి. నలభై ఏండ్లు వచ్చె. ఆయప్ప కండ్లముందరే కొడుకు తలనెరిసె. అయినా సరే ఆ కొడుకుకు రవంత పై ఎచ్చగయితే పాలుతాగే పిల్లోనికి నుస్తీ జేసినట్ల తల్లడిల్లిపోతాడు ముసలాయప్ప.

అయప్ప ప్రాణాలన్నీ కొడుకు మీదే! అయప్ప ప్రాణాలన్నీ కొడుకు సంసారంమీదే!!మల్లన్న ఎక్కడికి పోయినాడమ్మా? ముద్ద తినిపోయినాడా లేదా? అని కొడుకును గురించి పొద్దుకొకసారి విచారిస్తూనే వుంటాడు. 'వాడు ఈ కలికాలంలో పుట్టాల్సినోడు కాడు తల్లీ. ఉత్త సత్తెకాలపు మనిషి. ఇంక ఎక్కువ కాలం బతకనమ్మా నేను. అంతా నీదే భారం. వాన్ని ఎట్ల చూసుకుంటావో! ఈ సంసారాన్ని ఎట్ల నడుపుకొస్తావో!! అని కొడుకును చిన్న పిల్లోన్ని మాదిరిగా కోడలుకు ఒప్పజెపుతాంటాడు.

తెల్లెద్దు ప్రాణం దినాల మింద ఉండె!

ఒక దినం మాదిగ హనమంతు వచ్చె. మల్లన్న మామా అని వరుసపెట్టి పిలిచె. తెల్లెద్దు మూలపడిందంటనే, ఇస్తావా? అని అడిగె.

"ఎద్దా? అది నా తండ్రివంటి ఎద్దురా? నన్నూ నా సంసారాన్నీ సాకింది; ఆ ఎద్దేరా! దాన్ని తలుసుకుని ఇంట్లో దీపం పెట్టుకోవల్ల. అట్లాంటి దాన్ని ఈ పొద్దు ముసలిదైపోయిందని నూరూ నూటా యాభైరూపాయలకు కక్కుర్తిపడి అమ్ముతానా? కండలు కండలుగా కోసుకుని తినేదానికి ఇస్తానా? థూ...థూ..." అనె.

"ఇస్తావని వస్తి - అనక నీ ఇష్టం' అని ఎల్లిపాయ మాదిగ హనుమంతు. మల్లన్న ఇంట్లోకి వచ్చె. 'అయితే మన తెల్లెద్దు బతకదా నాయనా" అని అడిగె చిన్న కొడుకు కిష్టప్ప.

"ఇంకెక్కడ బతుకుతుందిరా? దానికీ మనకీ రుణం తీరిపాయ" అనె ఎద్దు పక్క ఒకసారి చూసి.

"ఇన్నేండ్లూ మనతోపాటు కష్టం చేసి మన ఇంటి మనిషి మాదిరి మెలిగింది కదా నాయనా! దాన్ని మన చేనులోనే పూడ్చి గోరీ కడదాము పాపం" అనె పెద్ద కొడుకు దొణతిమ్మడు.

"ఔనప్పా! అట్ల చేస్తే బాగుంటుంది" అనె ముసలాయప్ప కూడా.

మల్లన్న భార్యకు సంక్రాంతి పండుగ ముందు చేసిన పశువుల పండుగ గుర్తొచ్చె. ఆ దినం కర్రెద్దుతోపాటు తెల్లెద్దు కొమ్ములకు పసుపు పూసె. నుదుట కుంకుమ బొట్టు పెట్టె. బియ్యంలోకి బెల్లం పోసి వండిన పాశికం దాని ఎదురుగా పెట్టె. అది తోక ఊపుకుంటూ, బిరబిరా తింటాంటే దాని కుశాల చూసి మురిసిపాయ. ఈనాడు అది గడ్డిపాస ముట్టకుండా మరణయాతన అనుభగిస్తాంటే, చూసి కండ్లల్లో నీళ్ళు కక్కుకుండె అయమ్మ.

★★★

శెట్టి అంగట్లో కూర్చుని మల్లన్న లెక్క ఏసె. 'బళ్లారి శార్దీలకు ఇరవై అయిదు రూపాయలు. పై ఖర్చులకు ఇరవయ్యో, ముప్పయ్యో కాబడతాయి. అరవై రూపాయలు ఉంటే సరిపోతాయి' అనుకుండె.

అరవై రూపాయలు ఎట్ల? శెట్టిని అప్పు అడిగితే...? అనుకుండె. అప్పుడు శెట్టికి కట్టాల్సిన పాత అప్పులు గుర్తుకొచ్చి మళ్ళీ అప్పు అడిగేదానికి మొగం సెల్లకపాయ.

పక్కింటి పుల్లన్నను అడిగితే? అనుకుండె.

సన్నాసీ సన్నాసీ రాసుకుంటే బూడిదే కదా రాలేది' అని నవ్వుకుండె...

'రెడ్లోల్లను అడిగితే?' అనుకుండె. 'అరవై రూపాయలకు నూట ఇరవై రూపాయల రెక్కల కష్టం చేయించుకుంటారు. వద్దు సామీ వద్దు అని చెంపలేసుకుండె.

'ఎద్దును మాదిగ హనుమంతుగానికి ఇచ్చేస్తే...?' అని ఆలోసన వచ్చె. ఆ ముసిలెద్దులో ముసలితండ్రి మొగం కనిపించినట్లయి కంపరంగా తల ఇదిలించె. థూ థూ మనిసి బుద్ధి అని అయప్పను అయప్పే తిట్టుకుండె.

ఇంటికి వచ్చిన మొగునితో గంగమ్మ తన మనసులోని మాటను బైటికి పెట్టె. 'ఏమే! ఈసారి మీతోపాటు నేను కూడా వస్తానే బళ్ళారికి. ఒక నెల కూలి చేస్తే నాలుగు నూర్లు, అయిదు నూర్లు తెస్తాను కదా నేను కూడా' అనె.

'నువ్వు కూడా వస్తే ఇంట్లో మిగిలిన ఆ కర్రెద్దును ఎవరు మేపుతారు? అని అడిగె మల్లన్న.

'మా నాయనను ఎవరు చూసుకుంటారు? అయప్ప పూర్తిగా నిల్సిపాయ కదా' అని అడిగె.

'ఎట్లో అగసాట్లు పడతాడులే కొన్నాళ్లు. దినానికి ఒక పావు నూకలు ఉడకబెట్టుకోలేడా? అనె అయమ్మ.

'అయప్పకు ఆ మాత్రం చేవ గూడాయాడవుంది పాపం?' అనె.

'చేత కాదంటే ఎట్ల? మా నాయనో, మా మామో అని వాళ్ల దగ్గర గొంతు కూర్సుంటే కడుపులు నిండుతాయా? సంసారం నడిచేది ఎట్ల మల్ల? అనె గంగమ్మ. అంతే మల్లన్న కస్సుమంటా లేచె. 'నాకు జన్మనిచ్చిన తండ్రిని, ఆ రోగిష్టి మనిషిని ఇంట్లో ఒక్కన్నీ ఇడిసి పెట్టి పోదామంటావా? నీకు నోరెట్ల వచ్చిందే ఆ మాట అనేదానికి? నీకు నీ పిల్లోల్లు, నీ సంసారమేగాని, మా నాయనా సచ్చిపోయినా పరవాలేదా? ఆడదానికి కనికరం ఉంటుందన్న నా కొడుకు ఎవడే? వాన్ని చెప్పు తీసుకుని తన్నల్ల. నోట్లో ఇన్ని మంచి నీల్లు పోసే దిక్కన్నా లేకుండా మా నాయన సచ్చిపోతే నలుగురూ నన్ను మూస్తారే. నిన్ను కాదు. ముసలి ముప్పన తండ్రిని చూపెట్టుకోలేని కొడుకు కూడా ఒక కొడుకేనా? థూ! అట్లాంటి పాపిష్టి బతుకు బతికేదానికంటే ఏట్లోకి దూకి సచ్చిపోయేది మేలు' అని బుజం మీద బట్టని ఛర్రుమని ఇదిలించి లేచిపాయ.

ఆ దినమంతా మొగుడూ, పెండ్లామూ మాట్లాడుకోలే. మల్లన్న బైట బైటనే తిరిగె ఇంట్లోకి రాకుండా. రాత్రాయ దోమలు కరసకుండా పిల్లోల్లమింద రగ్గు సరిగా కప్పి మొగుని పక్కకు జరిగె గంగమ్మ.

"ఏమే?" అని మల్లన్న బుజం గిరె.

"ఊ..." అనె మల్లన్న దుప్పట్లోనే బిర్రుగా బిగదీసుకొని.

"నిన్నే...!" అనె కొంచెం గట్టిగా భార్య.

"ఏమి?" అనె దుప్పట్లోంచి తాబేలు మాదిరి తలబైటికి పెట్టి మల్లన్న.

"ఏమి? అట్లుండావు?" అని మొదలు పెట్టె అయమ్మ.

"ఎట్లుండానూ?" అని సాగదీసె అయప్ప.

"అదే మాదిరిగా ఉండావు" అనె పెండ్లాము.

"ఎట్లుంటేనేమిలే" అని నిష్టూరంగా అనె మొగుడు.

"నేను మీ నాయనను సరిగా చూసుకోలేదనే కదా నామింద నువ్వు అగ్గి కురుస్తాండేది" అని అసలు సంగతి ఎత్తె.

దానికి మల్లన్న మాట్లాడలే.

"మీ నాయన మింద నాకు పగనా? నీకు నాయన అయితే నాకు మామ కాడా? నేను కూడా బళ్ళారి వస్తే నీ కూలి దుడ్లకు నా కూలి దుడ్లు కూడా కలుస్తాయి కదా! కర్రెద్దు జతకి ఒక సన్నని గిత్తనన్నా పట్టుకోవచ్చు కదా అనే ఆశతో ఆ రకంగా మాట్లాడితి. నాకు మాత్తరం ముసలాయప్ప ఇంటి దగ్గర ఒక్కడే ఎట్లుంటాడనే దిగులు లేదా?" అనె గంగమ్మ.

చెయ్యని దొంగతనానికి నేరం మోసుకున్నట్లు వెతనంతా ఎల్లబోసుకోబట్టె.

"చెప్పు! నీ మనస్పొచ్చిగా చెప్పు సామీ! నేను ఏనాడన్నా ఒక దుబారా మాట అన్నానా మీ నాయన్ని? అయప్ప మాటకు ఎదురు మాట్లాడినానా ఎప్పుడన్నా? మీ నాయనకు పెట్టకుండా నేను ఎప్పుడన్నా ఏందన్నా దాచి పెట్టుకుని తిని ఉంటే నేనూ నా పిల్లోల్లూ ఇళ్లే బుడంనాశం అయిపోవల్ల" అనె. అట్ల అంటాంటే ఆయమ్మ గొంతు పూడకపాయ. కండ్లల్లోంచి నీళ్లు టపటపరాలె.

పెండ్లాం మంచితనం గుర్తొచ్చి ఏదో తప్పు చేసినట్ల మల్లన్న నొచ్చుకుండె. ఎల్లకిలా పండుకున్నవాడు గంగమ్మ పక్కకు తిరిగె.

"ఊరుకోయే ఊరుకో. నాకు తెలీదా నీ మనసు ఎట్లాంటిదో? నాకు తల్లి పోయినప్పటినుండీ మా నాయన నన్ను ఎంత నెర్లుగా సాకినాడో నీకు తెలీదా? అయప్ప ముందే రోగిష్టి మనిసి. అట్లాంటి మనిసిని ఇంటికాడ ఒక్కన్నీ ఇడిసిపెట్టి నువ్వుకూడా కూలికి బయల్దేరతానంటే, కోపమొచ్చి అట్ల మాట్లాడితి. ఊరుకో ఊరుకో..." అనె. సన్నగా ఎలుగుతాండే బుడ్డి దీపం మసక వెలుతుర్లో పెండ్లాం కళ్ళని తడిమె.

"తెల్లెద్దు సచ్చిపోతే... ఉన్న ఒక ఎద్దునూ పట్టుకొనిసేద్యమెట్ల చేసుకుంటాము? కూలి మడకలు ఎట్ల కడతాము? బండి కూళ్ళు లేకపోతే తట్టలోకి బువ్వ ఎట్ల మనకి? రవంత ఆలోసించు సామీ" అని కొంగుతో కండ్లు ఒత్తుకుండె. అప్పుడు పడె మల్లన్న మనసులోకి ఆ మాట.

'నిజమే! ఒంటెద్దుతో పని ఎట్ల జరుగుతుంది? ఒంటి కాలితో ఎన్ని ఆమడలని పరుగెత్తుతాను? ఇంట్లో అందరూ పనికి పోకపోతే గిత్తను పట్టుకుండే దానికి దుడ్లు ఎట్ల

వస్తాయి? ఎద్దులు లేకపోతే సేద్యం లేదు. ముద్ద లేకపోతే తండ్రీ లేడూ, కొడుకూ లేడు'. ఎంత ఆలోసించినా భార్య చెప్పినట్ల అంతా బళ్ళారికి పోక తప్పదనిపించె.

★★★

పొద్దున్నే ముసిలోడు అరుగు మీద కూర్చోనుండె. కట్టెపుల్ల మాదిరి ఉండె. కంపమీద ఆరేసిన బట్ట మాదిరి ఎముకలు సెర్మం పైకి పొడుచుకొస్తాండె. ఖంగు ఖంగుమని దగ్గుతాండె. నోట్లో గల్ల వచ్చినప్పుడు థుపుక్కమని కిందికి ముూస్తాండె. ఆయాసంతో రొప్పుతాండె. మధ్య మధ్య మూలుగుతాండె. అప్పుడప్పుడు అమ్మా అని బాధగా అరుస్తాండె.

కొడుకుపోయి ముసిలోని దగ్గర నిలబడె. నిముసం గడిసె. రెండు నిముసాలు గడిసె. కానీ ఆ రోగిష్టి తండ్రిని ఇంటి దగ్గర ఒక్కన్నే ఇడిసి పెట్టిపోతామని చెప్పేదానికి నోరురాలే. ఇంకా కొంత సేపు గడిసె. గొంతు సర్దుకుండె. "నాయనా!" అని పిలిసె. ఆ మాట ముసిలోని దగ్గులో కలిసిపాయ. ఈసారి గట్టిగా పిలిసె. వినపడె. ముసిలోడు తలతిప్పి... ఏమప్పా? అన్నట్లు చూసి మళ్లీ దగ్గబట్టె. ఈ దగ్గుతెర నిలిసిపోయినంక మల్లన్న అనె "ఈ సారి నేనూ నీకోడలూ ఇంట్లో అందరమూ పోవల్ల అనుకుంటాండాము బళ్ళారికి" అని.

"మంచిదప్పా" అనె ముసిలోడు. ఆ మాటవిని తండ్రి నాలిక మీదనుంచీ అంటాండాడో లేక లోపల నుంచి అంటాండాడో అర్థం కాలే మల్లన్నకు.

"మేమంతా పోతే, ఈ రోగంతో నువ్వు ఒక్కనివే ఇంటిదగ్గర..." అని గుటకలు మింగె. ఏదో తప్పు చేస్తా ఉన్నట్లు తలొంచుకుండె.

"పోనీ, నీ కోడల్ని ఇంటిదగ్గరే ఇడిసి పెట్టి పోదునా? అన్నం ఉడకేసుకుండే దానికి నీకు చేతకాదేమో!" అని సర్దుకుండె.

"అయ్యో నేను ఎట్లో అగసాట్లు పడతానులే కొన్నాళ్లు. మీరు పోయిరండి అప్పా" అనె ముసిలోడు.

"నా గురించి సింత పెట్టుకోవద్దు నాయనా! ఈ ముసిలోని దగ్గర గొంతుకూర్సుంటే కడుపు నిండుతుందా? కాలు నిండుతుందా? మన సంసారం పరిస్థితి కూడా బాగాలేదు కదా! మీరు సేమంగా పోయి లాభంగా రండి. అంతే నాకు కావలసింది" అనె.

అప్పటికి మల్లన్న సమాధానపడలే. మెదలకుండా నిలబడి ఉండె.

ఈసారి ముసిలోడు రవంత గట్టిగా అనె "నా పక్క కాదు నాయనా, నీ బిడ్డల పక్క సూడు. నేను నిన్ను పెద్ద జేసినట్లు నువ్వు కూడా నీ పిల్లోల్లని పెంచి పెద్ద చేయల్ల కదా? ఇంత అన్నంపెట్టి వాళ్లను బతికించుకోవల్ల కదా!" అనె.

"నాదేముంది? ముసిలోణ్ని! ఈ పొద్దుగాకపోతే రేపు! మాగిన పండు ఎంత కాలముంటుంది చెట్టుమింద? నువ్వూ నీ పిల్లోళ్లూ నాలుగు కాలాలపాటు బతికి బట్టకట్టల్ల నాయనా! అంతే నేను కోరుకుండేది" అనె.

మల్లన్నకు కడుపులోనుంచి దుఃఖం ఎగదన్నుకొచ్చె. తండ్రికి మొగం చూపించలేక సరసర నడిసిపాయ.

'నాయన నాయన... నన్ను బుజాల మింద మోసిన నాయనా! నా సిన్నప్పుడు నా ముడ్డి కడిగిన నాయన! తల్లిపోతే తల్లి మాదిరి సాకిన నాయన! నాకు కడుపునొప్పివస్తే ఆ పూటకు అన్నం ముట్టని నాయన! నేను బాగుంటే సాలని కోటి దేవుళ్ళకు మొక్కుకుండే నాయన! అట్లాంటి నాయన! రోగిష్టి నాయన! కాటికి కాళ్ళు సాచుకున్న ముసలి నాయన! అయినా సరే, ఆయప్పను ఇడిసి పెట్టి పోవలసిందే, బతుకు తెరువు కోసరం - అంతే అంతే... నెర్లూ గిర్లూ లేదు. కనికరం లేదు. మమతా బంధమూ లేదు. లేవు లేవు. ఏమీ లేవు. అవన్నీ బతుకు అనంకే!'

'బతకల్ల. బతకల్ల ఎట్లయినా సరే బతికి తీరల్ల' 'థూ దీనెమ్మ బతుకు' అనుకుని దోవలో కేకరిచ్చి మూసె. అంతదూరంలో మాదిగ హనుమంతు కనపడె. బతుకు మింద సటాయం పుట్టె. "లే! హనుమంతూ" అని కూతేసి పిల్సె. ఏదో పూనకమొచ్చినట్ల కాళ్లూ సేతులూ వణుకుతాండె.

"ఎద్దును తోలుకొచ్చుకోపోరా. ఎంతిస్తావు?" అనె. అప్పుడు మల్లన్న గొంతుని విని తీరల్ల. అన్నిటికీ తెగించి నట్లుండె. బతికే దానికి అడ్డమొచ్చిన దాన్నల్లా కాళ్ళకింద కసా బిసా తొక్కుకుంటా పొయ్యేటట్లుండె.

"దానిలో సారమేముంది మల్లన్న మామా! కోసుకుంటే ఇంత కొవ్వు కూడా పడదు. ఎనబై ఇస్తాను" అనె మాదిగ హనుమంతు.

"నూరుచేసుకోరా" అని బేరమాడె ఇంకా బతికే వున్న తెల్లెద్దు మాంసం మీద.

"తొంబై ఇస్తాను" అనె హనుమంతు.

"సరే పోరా, తోలుకొచ్చుకో పో. దుడ్లు మాత్రం రెండు దినాల్లో ఎదిగి ఇయ్యాల్ల, నేనూ, నీ చెల్లెలూ బళ్ళారికి పోవల్ల అనుకుంటాండాము" అని ఎచ్చరించె. మల్లన్నకు లోలోపల దేనిమిందో కసిపుడతాండే.

"అలే హనుమంతూ! ఉండుండు" అని ఎల్లిపోయే హనుమంతుని కూతేసె. "దాని సెర్మంతో నాకు మంచి చెప్పులు కుట్టియ్యల్లరా మరిసిపోవద్దు" అని అరిసె. అప్పుడు నూడల్ల మల్లన్నను, కత్తిగినా దొరికితే ఆయప్పను ఆయప్పే పొడుసుకుని సచ్చేటట్లు ఉండె.

పొద్దు మునుగుతాండె. ఎద్దును తోలుకు పోయేదానికి నలుగురు మనుసులు

వచ్చిరి. అప్పుడు మల్లన్న ఇంట్లోనే ఉండె.

వాళ్లు ఎద్దును లేపేదానికి చూసిరి. తోడు అశపెట్టిరి. బెల్లపుంటలు నూపెట్టిరి. అది లెయ్యలే. తోకను పురి తిప్పిరి. అది పై అంతా జలదరించి నాలుగు కాళ్లూ బాళ్లా సాపి బుస్సుమంటూ మూలుగుతా పక్కకు ఒరిగిపాయ.

మల్లన్న చూస్తాండె.

మునలాయప్ప చూస్తాండె.

గంగమ్మ చూస్తాండె.

వాళ్ల పేగులు తెగిపోతాండె.

కానీ, కండ్ల ముందర తెంబైరూపాయల దుడ్లు కనపడతాండె.

ఆ నలుగురూ దాన్ని మల్లీ లేపేదానికి చూస్తాండిరి. మల్లన్న కలగజేసుకుండె. "దాన్ని యాల యాతన పెడతార్రా? బండి కట్టకొచ్చి ఏసకపోండి" అనె. ఇంక అడ నిలబడే దానికి కాళ్లు రాలే. బైటికి ఎల్లిపోయి సావిట్లో కూర్చుండె.

వాళ్లు బండిని కట్టుకొచ్చిరి. తెల్లెద్దును ఒక వస్తువు మాదిరి బండిలోనికి నూకిరి, కర్రెద్దు నెమరేసుకుంటా దాని లోకంలో అది ఉండె.

బండి కదిలె.

ఆ బండిని కూడా ఎద్దులే లాగుతాండె.

తెల్లెద్దు పోతాండె.

దాని డొక్కలు లోనికి పీక్కుపోయి ఉండె.

దాని బర్రెముకలు బైటికే కనిపిస్తాండె.

కాని, దేవుడిచ్చిన రీవి మాత్రం దాని కొమ్ముల్లో తగ్గలే!

అది ఎవర్నీ తిట్టలే. ఎవర్నీ ఏమీ తప్పు పట్టలే. కిక్కురుమనకుండా సావు నోట్లోకి ఎల్లిపాయ.

దొణతిమ్మడు పొద్దునే మాదిగగేరిలోకి పరుగెత్తె. అడ తెల్లెద్దుని మాంసం కండలు గుట్టగా ఉండె. ఆ మాంసం కుప్ప పక్కనే మొండెంలేని తెల్లెద్దు తల సింత జేస్తాన్నట్ల కన్పించె. దొణ తిమ్మడు ఇంటికి పరుగెత్తుకొచ్చె. అడ చూసిన మాంసం గుట్టనీ, తెల్లెద్దు తలనీ తండ్రి దగ్గర వర్ణించె. మల్లన్నకు చిర్రెత్తుకొచ్చె. అత్త మీద కోపం దుత్తమీద చూపినట్లు కొడుకుని సాచి ఒక్క ఏటు ఇడిసె. "నేనేం జేస్తి నన్ను కొడతావ్" అని ఆ పిల్లోడు ఎదురు మాట్లాడె.

కొడుకు జుట్టు పట్టుకొని మల్లన్న ఈడ్చి ఈడ్చి తన్నబట్టె. ఆ పిల్లోనికి వాళ్ల అమ్మ అడ్డం వచ్చె. అడ్డం వచ్చిన అయమ్మకు కూడా రెండు దెబ్బలు తగిలె. దొణతిమ్మడు ఏడుస్తా బైటికి వచ్చె. 'తెల్లెద్దుకు మా చేనులోనే గోరీ కడతాము. నేను

రెడ్డోల్ల తోటలోకి పోయి, నాలుగు చెండు మల్లి పూలు పీక్కొచ్చి దండకట్టి తెల్లెద్దు గోరీ మింద ఏసి దినానికి ఒకసారైనా దండం పెట్టుకుంటాను. అని ఎంతో ఇదిగా ఆలోసించిన ఆ పిల్లోనికి అనుకున్నదంతా తల్లకిందుల అయి పోయినట్లు కనపడె.

మూడు దినాలు గడిసె. తట్టా బుట్టా సర్దుకొని పిల్లా జెల్లాతో మల్లన్న బస్సెక్కి కూర్చుండె. 'నా కొడుకూ, మనుమల్లూ అంతా తిరిగివచ్చేవరకూ నా పానాలు తీసకపోవద్దు బగమంతుడా!' అని ముసిలాయన మనసులో దేవున్ని వేడుకుండె.

బస్సు కదిలె.

మల్లన్న కండక్టరుకు చార్జీ దుడ్లు ఎంచిచ్చె. అట్ల ఎంచిచ్చేటప్పుడు తెల్లెద్దువి ఎర్రని మాంసం కండల్ని నెత్తిమీద ఎవరో గుమ్మరించినట్లు అనిపించె. శరీరం జలదరించి మల్లన్న గట్టిగా కండ్లు మూసుకుండె.

'మా నాయన మనసుల్లో పుట్టాల్సినోడు కాదు. రాచ్చసుల్లో పుట్టాల్సినోడు. మా ముసిలెద్దు మీద రవంత కూడా కనికరం లేకపాయ. ఛూ!' అని దొణతిమ్మడు తండ్రిని మనసులోనే తిట్టుకుండె.